క్లుప్తంగా

పోలీస్ స్పందనకు 71 ఫిర్యాదులు



ఫిర్యాదీ సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: సోమవారం కాకినాడలోని జిల్లా ఎస్పి కార్యాలయంలో పోలీస్ స్పందన జరిగింది. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ 71 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అడ్‌హక్ కమిటీ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ను కమిటీ సభ్యులు కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డిని కలిశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తెనపల్లి మల్లేశ్వరరావు, జిల్లా చైర్మన్ సవరపు చిన పాపారావు, కన్వీనర్ ఖండవిల్లి చంద్రశేఖర్, కోశాధికారి కొప్పిశెట్టి కృష్ణ, సభ్యులు షేక్ ముంతాజ్‌బేగం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఏఎస్ఐ నేత్రదానం

బాలాజీచెరువు: రాయుడుపాలేనికి చెందిన విశ్రాంత ఏఎస్ఐ రాయుడు పాపారావు మరణించగా ఆయన నేత్రాలను అల్లుడు యనమదల రాజేష్ సోమవారం బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు అందజేశారు. నేత్రాలు అందజేసిన వారి కుటుంబ సభ్యులను ఐబ్యాంక్ చైర్మన్ శంకరరావు, కార్యదర్శి బాలకృష్ణ అభినందించి మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించిన పాపారావు కుటుంబ సభ్యులకు ఐబ్యాంక్ తరపున ప్రసంసాపత్రం అందజేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కాకినాడ: కాంగ్రెస్ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా వెంకట శివప్రసాద్, ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో నియమితులైన పై ముగ్గురు పార్టీ నాయకులు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజులను సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పాండు రంగారావు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, నియోజవర్గ ఇన్‌చార్జిలు కోలా ప్రసాద్ వర్మ, మారోతు శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనస్థీషియా డే

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సోమవారం అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవం జరిగింది. ఆర్ఎంసీ అనస్థీషియా వైద్య విభాగం, కాకినాడ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎంసీ అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఆర్ ప్రాధాన్యతను వివరించేలా ప్రత్యేక కళా రూపకాన్ని వైద్య విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం డబ్ల్యూటీజీ మోర్టన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాన్సర్ నిర్వహణలో మత్తు వైద్య సాయంతో నొప్పి నివారణ వైద్య విధానాలపై డాక్టర్ పర్వీన్ ప్రసంగించారు.

శస్త్ర చికిత్సలో మత్తు మందు కీలకం

కాకినాడ రూరల్: రోగులకు శస్త్ర చికిత్సలో మత్తు మందు కీలకమని ప్రముఖ అనస్థీషియా వైద్యుడు చిట్లా కిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ అనస్తీసియా దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టరు కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. అడబాల రత్నప్రసాద్, డాక్టరు అద్దాల సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణితం లెక్చరర్‌ను నియమించాలి

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ (ప్లస్ టు) ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు గణితం లెక్చరర్‌ను నియమించాలని కోరుతూ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాకు తల్లిదండ్రులు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతకాలు సేకరించి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలుతో కలసి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు మాజీ సర్పంచ్ తెలిపారు.



ఊయల అలంకరణలో దర్శనమిచ్చిన సూర్యారావుపేట బాలత్రిపుర సుందరి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో భానుగుడి రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు



కరప శివాలయంలో పర్వతవర్ధనీదేవిని ఊయల అవతారంలో అలంకరించిన దృశ్యం

జయము జగదీశ్వరీ..

- మార్మోగిన అమ్మ నామస్మరణ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- విశేష పూజలు చేసిన అర్చకులు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి ఆలయంలో ఊయల అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చక్రధారి భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. జగన్మాత నాట్యాలయ విద్యార్థుల కూచిపూడి నృత్యం, అనంతరం జ్యోతి నృత్య కళానికేతన్, నటరాజ్ కళామందిర్ వారి నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులు అన్నదానం చేశారు. మాధవనగర్‌లో కనకదుర్గ అమ్మవారు జపమాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కార్యదర్శి ఎస్‌వీ సాయిబాబా పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో నవావరణార్చన, కుంకుమ పూజ నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వర ఆలయంలో బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కామాక్షీదేవిగా ఐశ్వర్యాంబిక

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రమణయ్యపేటలోని శ్రీపీఠంలో కొలువైన ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను పరిపూర్ణనంద స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. రెండో రోజు సాయంత్రం కామాక్షీదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

గాయత్రీదేవిగా అమ్మవార్లు

కరప: మండలంలోని దుర్గాదేవి ఆలయాల్లోను, విష్ణాలయం, శివాలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. కరప, అరట్లకట్ట, నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, వలసపాకల, కూరాడ, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, వాకాడ తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మ వారికి కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్, విష్ణాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధనీదేవి అమ్మవారిని ఊయలలో కూర్చోబెట్టి అర్చకులు విలపర్తి శ్రీనివాస్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రమణ్యపేట శ్రీపీఠంలో కామాక్షీదేవిగా దర్శనమిస్తున్న ఐశ్వర్యాంబిక

'స్పందన'తో సమస్యల పరిష్కారం

కమిషనర్ నాగ నరసింహారావు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికే సీఎం జగన్ స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం జగనన్నకు చెబుదాంలో భాగంగా తొలుత డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్ల వంటి మౌలిక వసతుల కల్పన, రహదారి పక్కన అవరోధంగా ఉన్న చెట్ల తొలగింపు వంటి అంశాలపై 9 మంది ఫోన్ ద్వారా విన్నవించారు. అనంతరం నిర్వహించిన స్పందనకు 22 మంది దరఖాస్తులు అందజేశారు. అనధికార కట్టడాలు తొలగింపు, శునకాల బెడద తదితర సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. విజ్ఞప్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషన్ అధికారులను ఆదేశించారు. నిర్ధిష్ట సమయంలో పరిష్కరించి ఆ సమచారాన్ని ఫిర్యాదుదారుకు ఇస్తామని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి రాలేని వారు స్థానిక సచివాలయంలో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈ లు వెంకట్రావు, మాధవి, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



సర్వేయర్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ప్రారంభించారు. రూ.10లక్షలతో ఆధునీకరించిన భవనంలో సర్వేయర్ కోసం ప్రత్యేక గదితో పాటు పై అంతస్తులో సమావేశ హాలును వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించుకునేలా తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆధునీకరణ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు సుందరంగా తయారవుతున్నాయన్నారు. త్వరలో కరప తహసీల్దార్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తామన్నారు. ఆర్డీఓ సత్యనారాయణ, తహసీల్దార్ మురార్జీ, మండల సర్వేయర్ వేణుగోపాలాచార్యులు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, జేఎన్‌టీయూకే ఈసీ సభ్యుడు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, పుల్ల చందు, మండల ఇంజినీర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

కాకినాడ సిటీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం మండలం తూరంగి సూర్యనగర్‌లో రూ.1.5 కోట్లతో నిర్మించిన వివిధ పనులను స్థానిక నాయకులు, పెద్దలు, పార్టీ కార్యకర్తలతో కలసి సోమవారం ప్రారంభించారు. సూర్యనగర్‌లో రూ.40 లక్షలతో నిర్మించి సచివాలయ భవనం, మరో రూ.50 లక్షలతో నిర్మించిన మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. అనంతరం తూరంగేశ్వర దేవస్థానం కమిటీ చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏ సమస్యా లేకుండా సంతోషంగా ఉంచిన ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని మహిళలు ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వెలమల తూరంగిలోని వెలంపేటలో రూ.20 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తూరంగి శివాలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, రొంగల వెంకటేశ్వరరావు, జక్కి వెంకటేశ్వరరావు, ఆతం భద్రం, సుధాకరరెడ్డి, గణపతిరెడ్డి, బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్ధార్థ ఐటీఐలో సాంకేతిక విద్య విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బొడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

కాకినాడ రూరల్: దసరా పండగను పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ కాకినాడ సంకల్ప ఆధ్వర్యంలో పేదలకు సోమవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మెట్టా రాధ మాట్లాడుతూ సమాజ సేవలో ఎంతో సంతృప్తి ఉందని అందువల్లే తమ క్లబ్ ద్వారా పేదలు, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. సోమా రాజేశ్వరి, పున్నమరాజు రాజేశ్వరి, అపరాజిత పరాంకుశం, పురాణపండ మహాలక్ష్మి, పోకల మాలతి, ఆధ్యాత్మిక డాక్టరు శిరీష, అడబాల రత్న ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో వ్యర్థాల తొలగింపు



సూర్యారావుపేట బీచ్‌లో నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

కాకినాడ రూరల్: పర్యావరణ హితం కోరుతూ సూర్యారావుపేట బీచ్‌లో నేషనల్ గ్రీన్ కారోప్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈనెల 13నుంచి వారం రోజులు పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు ఆఫీసరు సత్యనారాయణ మాట్లాడుతూ బీచ్ క్లీన్‌సెన్‌తో పాటు అవగాహన కార్యక్రమాన్ని లైఫ్ ఎకో క్లబ్స్ సహకారంతో చేపట్టినట్టు ఆయన తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి

- సీఎం జగన్ కోసం ప్రార్థనలు చేయండి
- ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి



సీఎం కోసం, ఎమ్మెల్యేల కోసం ప్రార్థన చేస్తున్న పాస్టర్

కాకినాడ: క్రైస్తవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని, ఆయనను రెండో సారి కూడా ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు శామ్యూల్ సాగర్ అధ్యక్షతన పాస్టర్ల సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక పాస్టర్లకు గౌరవ వేతనం, చర్చిల అభివృద్ధికి నిధుల మంజూరుతో పాటు మరెన్నో చర్యలు తీసుకున్నారన్నారు. ఆయనను రెండో సారి గెలిపించుకుంటే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తారన్నారు. సీఎం జగన్ గెలుపు కోసం క్రైస్తవులంతా ప్రార్థించాలని వారు కోరారు. పాస్టర్ల సంఘ ప్రతినిధులు జోసఫ్ బెన్ని, రిక్కి గూటం, సీవైఎఫ్ మూర్తి రాజు, పెద్ద సంఖ్యలో పాస్టర్లు హాజరయ్యారు. సీఎం కోసం, ఎమ్మెల్యేల కోసం ప్రార్థనలు చేశారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీతో ఆకట్టుకున్న చెన్నైకు చెందిన సజీవ్ నంబూద్రి

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ దసరా సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సూర్యకళామందిరంలో చెన్నైకు చెందిన సజీవ్ నంబూద్రి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ ఎంతగానో ఆలరించింది. మధ్యమావతి రాగంలో పాలించు కామాక్షి, అభేరి రాగంలో నగుమోము వంటి కీర్తనలకు ప్రేక్షకులు మైమరచిపోయారు. కచేరీకి వయోలిన్‌పై మావుడూరి సత్యనారాయణ, మృదంగంపై మహాదాసు ఏడుకొండలు, ఘటంపై సరస్వతుల హనుమంతరావు సహకారాన్ని అందించారు.

జేఎన్‌టీయూకే అధ్యాపకురాలికి డాక్టరేట్



వై.జయ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్సిటీ అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (ఏపీఆర్‌ఓ) వై.జయకు సోమవారం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. క్యాస్ట్ జండర్ ఇనీక్వాలిటీ ఇన్‌ద ఫిక్షన్ ఆఫ్ బామ పౌస్టినా అంశంపై సిద్ధాత వ్యాసం రచించారు. విశాఖకు జీవీపీ కళాశాల ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ జె.రవీంద్రనాథ్, హైదరాబాద్ ఇఫ్లూ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.సువర్ణలక్ష్మి ఆధ్వర్యంలో సమర్పించారు.

రీసర్వేలో అభ్యంతరాలను పరిష్కరించండి

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



రీ సర్వే అభ్యంతరాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: జగనన్న భూ రక్ష – భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేలో వచ్చిన అభ్యంతరాలకు సత్వర పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సర్వే, రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయా అభ్యంతరాలుపై ఏడీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ సత్యనారాయణ, తహసీల్దార్ మురార్జీ, మండల సర్వేయర్ వేణుగోపాలాచార్యులుతో సమీక్షించారు. రీ సర్వే ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు బదులిస్తూ ఈ వారం నుంచి అభ్యంతరాలను పరిష్కరిస్తామని తెలిపారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి అద్దెలు వసూలు

- హెచ్‌డీఎస్ ఖాతాకు రూ.21 లక్షలు జమ
- 'సాక్షి' కథనానికి స్పందన

కాకినాడ క్రైం: 'వ్యాపారాలు దండి... ఆస్పత్రికి గండి' శీర్షికన గత ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. నిరాటంకంగా వ్యాపారాలు నిర్వహించుకుంటూ రూ.లక్షలు అర్జిస్తు దుకాణాల అద్దెలు చెల్లించకుండా నెట్టుకొస్తున్న జీజీహెచ్‌లోని వ్యాపారులు ఎట్టకేలకు బకాయి అద్దెలు చెల్లించారు. ఈ క్రమంలోనే సోమవారం నాటికి సుమారు రూ.21 లక్షల అద్దెలు వసూలయ్యాయి. ఈ నిధులన్నీ హెచ్‌డీఎస్ ఖాతాకు చేరాయి. ఆసుపత్రి ఆవరణలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఉన్న టెలిఫోన్ బూత్ పేరుతో అనుమతి పొందిన దుకాణం డీవీకే ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి పేరున ఉందని నోటీసులు జారీ చేసినా అద్దె బకాయిలు చెల్లించని కారణంగా తాళం వేశామని అధికారులు వెల్లడించారు. ఈ ఒక్క దుకాణం నుంచి తప్ప మిగిలిన అన్ని వ్యాపార సముదాయాల నుంచి అద్దెలు పూర్తి స్థాయిలో అందాయని వారన్నారు.

ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో కళాశాల చైర్మన్ కృష్ణారావు, చిరంజీవినికుమారి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఐడియల్ కళాశాలలో రక్తదాన శిబిరం

బాలాజీచెరువు: ఉన్నత విద్యలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ విద్య కోసం సీఎం జగన్ అధిక నిధులు కేటాయించి నూరుశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నారన్నారు. కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన అగ్రికల్చరల్, ఫిషరీస్, న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్ ప్రాజెక్టులు సందర్శించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినికుమారి, గవర్నింగ్ బాడీ సభ్యులు కృష్ణంరాజు, కిరణ్, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల చట్టంపై విస్తృత ప్రచారం



వాకాడలో బాల్యవివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, అంగన్‌వాడీలు



బాల్యవివాహ చట్టాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళలు

కాకినాడ సిటీ: బాల్య వివాహం నేరమని తెలిసినా కొందరు తల్లిదండ్రులు పసి ప్రాయంలోనే బాలికలకు పెళ్లి చేస్తున్నారని వీటిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం జగన్నాథపురం ముత్తానగర్‌లో బాల్య వివాహం చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలను ఆపేందుకు ప్రభుత్వం హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచిందని, పెళ్లి జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే అధికారులు వచ్చి అడ్డుకుని, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి పి ప్రవీణ మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వరి, సీడీపీవో జ్యోతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకటరావు, సూపర్‌వైజర్లు అరుణశ్రీ, దయామణి, అరుణా దుర్గాంబ, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు, కిశోరబాలికలు, తల్లులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా వివాహాలు జరిపిస్తే 1098కి ఫోన్‌చేసి సమాచారం అందించాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం వాకాడలో సోమవారం ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వలంటీర్లు, మహిళాశక్తిసంఘాలతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వయసు 18 ఏళ్లు నిండిన యువతులకు, 21 ఏళ్లు నిండిన యువకులకు మాత్రమే వివాహం చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, మహిళా పోలీస్ బి.లక్ష్మి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.విజయలక్ష్మి, కె.అన్నపూర్ణల ఆధ్వర్యంలో కరప, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని హైస్కూళ్లలో బాల్యవిహాల నిరోధచట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, జ్యోతి, సత్యవతి, హైమకల్పలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీ యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



కాకినాడ రీజియన్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ కార్యవర్గం

బాలాజీచెరువు: ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ కాకినాడ రీజియన్ ప్రథమ ద్వైవార్షిక మహసభ ఆదివారం రాత్రి సూర్యాకళామందిరంలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా రీజనల్ హెడ్ సాయి మనోహర్ బ్యాంక్ ప్రగతిని వివరించి కాకినాడ రీజియన్‌కు నూతన కమిటీని నియమించారు. యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ రీజియన్ కార్యదర్శిగా ఎం.దుర్గాప్రసాద్, కోశాధికారిగా పి.రామ్‌జీ, డిప్యూటీ రీజనల్ కార్యదర్శిగా రంజిత్, సుధామౌనిక, అసిస్టెంట్ రీజనల్ కార్యదర్శిగా సుబ్రమ్మణ్యం, సభ్యులుగా బి.శ్రీనివాసరావు, ప్రసాద్, తాతాజీ, శ్రీనివాసరావు, సూర్యచంద్రశేఖరరావు, భీమరావు, శివ రాఘవయ్య, సత్యనారాయణ నియమితులయ్యారు. కార్యవర్గాన్ని ఏఐటీయూసీ నాయకులు తాటిపాక మధు, కాకినాడ బ్యాంక్ ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి బి.ఆదినారాయణమూర్తి అభినందించారు.

సిరిపురంలో సురక్ష శిబిరం



సిరిపురంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న నాయకులు అధికారులు

కరప: మండలం సిరిపురంలో సోమవారం సర్పంచ్ నున్న సుజాత అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 367 మంది పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఈ.సింధూర తదితర వైద్యనిపుణులు రోగులను పరీక్షించి మందులు రాసిచ్చారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం కేస్ షీట్, మందుల కిట్‌ను అధికారులు, నాయకులు కలసి రోగులకు అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, నున్న వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కె.ధనలక్ష్మి, కార్యదర్శి పి.శ్రీనివాస్, మండల ఆరోగ్యమిత్ర వంచర్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.